క్లుప్తంగా

చెట్లు పెంచడమే వనజీవి రామయ్యకు నివాళి

కొత్తగూడ: ప్రతీ ఒక్కరు చెట్లు పెంచడమే పద్మశ్రీ వనజీవి రామయ్యకు నిజమైన నివాళి అని జనప్రేమి వనప్రేమి డాక్టర్ పుల్సం సాంబయ్య అన్నారు. రామయ్యను స్మరిస్తూ మండలకేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మీనారాయణ, హెచ్ఎం శ్రీనివాస్, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మామిడి చెట్లు దగ్ధం

పెద్దవంగర: మామిడి తోటకు పక్కన సాగు చేసిన కందిచేను కొయ్యలకు అంటించిన అగ్ని పక్కనే ఉన్న ఓ రైతు మామిడి చెట్లు కాలిపోయాయి. ఈసంఘటన మండల పరిధిలోని శుక్రవారం చోటుచేసుకుంది. బాధిత రైతు చెప్పిన వివరాల ప్రకారం.. మండలంలోని అవుతాపురం గ్రామానికి చెందిన గద్దల అశోక్ మామిడి తోట పక్కనే ఉన్న తోటి రైతులు కందిసాగు చేశారు. కంది ఏరిన తర్వాత కందికొయ్యలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించారు. దీంతో చేనులో ఎండిన మొక్కలు కాలుతూ మామిడి తోట కంచెకు మంటలు అంటుకున్నాయి. 28చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతు ఆశోక్ కోరుతున్నాడు.

బీఆర్ఎస్‌లో చేరిక..

గూడూరు: అబద్ధాల మాటలు నమ్మి ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారని, తిరిగి మళ్లీ బీఆర్ఎస్ పాలనను కోరుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం కోబల్‌తండాకు చెందిన మాజీ ఎంపీటీసీ భాస్కర్‌తోపాటు 30మంది, దామరవంచకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు ఆయన సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వేం వెంకటకృష్ణారెడ్డి, ఎండి. ఖాసీం, సంపత్‌రావు, నర్సింహానాయక్, సురేందర్, వేణుమాధవ్‌రెడ్డి పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

పెద్దవంగర: మండల కేంద్రానికి చిలుక వెన్నెలకు గురువారం రాత్రి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందజేశారు. తొర్రూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి 108లో తీసుకెళ్తుతున్న క్రమంలో మార్గమధ్యలో పురిటి నొప్పులు అధికం కావడంతో వాహనాన్ని ఆపి ఈఎంపీ భావన, పైలెట్ దేవేందర్‌లు కుటుంబ సభ్యుల సహకారంతో అంబులెన్స్‌లోనే ప్రసవం చేశారు. వెన్నెల పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం మెరుగైన వైద్యం కోసం తొర్రూరు సీహెచ్‌సీకి తరలించారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

మహబూబాబాద్: ఉద్యమకారుల ప్లీనరీని విజయవంతం చేయాలని ఉద్యకారుల ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ వెంకన్న పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపంవద్ద శుక్రవారం ప్లీనరీ కార్యక్రమం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.

చికిత్స పొందుతున్న ఉపాధ్యాయుడి మృతి



వెంకటేష్ (ఫైల్)

మరిపెడ రూరల్: ఈ నెల 16న క్లాస్ రూంలో అస్వస్థతకు గురి కాగా, మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఈదర వెంకటేష్ (55) శుక్రవారం మృతి చెందాడు. ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన వెంకటేష్ మండలంలోని ఎల్లంపేట హైస్కూల్‌లో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పని చస్తున్నాడు. ఈనెల 16న క్లాస్ రూంలో ఒక్కసారిగా అస్వస్థతకు గురై కుప్పకూలాడు. ఎయిమ్స్ తరలించి చికిత్స అందిస్తుండగా అక్కడ గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

జనగామ: క్రీడలతో శారీరక ధృడత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రం ప్రెస్టన్ మైదానంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి రాజీవ్ మెమోరియల్ ట్రోఫీ(కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి క్రికెట్ టోర్నమెంట్ సీజన్–1) ముగింపు వేడుకల్లో శుక్రవారం పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీల్లో మహబూబాబాద్ ప్రథమ, జనగామ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి.

కోరిన కోర్కెలు తీర్చే తల్లి గంగాభవాని

- తానంచర్లలో ఈనెల 21నుంచి జాతర ప్రారంభం
- మూడు ఉమ్మడి జిల్లాల నుంచి పోటెత్తనున్న భక్తులు
- ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు



ముస్తాబైన గంగాభవాని ఆలయం



అమ్మవారి విగ్రహం



శివలింగం

మరిపెడ రూరల్: మరిపెడ మండలం తానంచర్ల శివారు పాలేరు నది వాగు ఒడ్డున స్వయంభుగా వెలసిన గంగాభవాని అమ్మవారు ఎంతో ప్రసిద్ధి. ప్రస్తుత మహబూబాబాద్, సూర్యాపేట జిల్లా సరిహద్దు ప్రాంతమైన మరిపెడ మండలంలో ఈ గంగాభవాని ఆలయం కొలువై ఉంది. భక్తులు కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా ఇక్కడి జాతర పూర్వం నుంచి ఎంతో ప్రసిద్ధి గావించడంతో ఉమ్మడి జిల్లాలైన వరంగల్, నల్లగొండ, ఖమ్మం నుంచి వేలాది మంది భక్తులు హాజరై తమ భక్తిని చాటుకుంటారు. కులమతాలకు అతీతంగా భక్తులు పెద్దసంఖ్యలో ఇక్కడి జాతరకు హాజరై అమ్మవారిని దర్శించుకుంటారు. ఈనెల 21నుంచి 23 వరకు మూడు రోజులు జరిగే ఈ గ్రామ దేవత జాతరకు వివిధ వాహనాల్లో వచ్చి వారి కోరికలు తీర్చుకొని వెళ్తారు. భక్తుల రాకా కోసం ఎదురు చూస్తున్న అమ్మవారి ఆలయాన్ని అన్ని హంగులతో ఆలయం ముచ్చటగా ముస్తాబైంది.

ఆలయ పూర్వ చరిత్ర

మరిపెడ మండలం తానంచర్ల గ్రామ భూస్వామి రామసహాయం రాఘవరెడ్డి గారి వ్యవసాయ క్షేత్రంలో స్వయంభుగా వెలిసిన గంగాభవాని అమ్మవారు రాఘవరెడ్డి కలలో కనిపించి తనకు పూజలు చేయాలని ఆదేశించింది. రాఘవరెడ్డి తన యాదవ మిత్రులతో కలిసి వెళ్లి కలలో వచ్చి స్థలంలోని దట్టమైన అటవీని తొలగించి చూడగా ఆశ్చర్యానికి గురయ్యారు. యావత్ భారతదేశంలోనే ఎక్కడ లేని విధంగా అతిపెద్దదైన 'ఏకశిల శివలింగాకారం' ఓ రాతి శిలకు అమ్మవారి విగ్రహం దర్శనమిచ్చింది. అప్పటి నుంచి నేటి వరకు రాఘవరెడ్డి కుటుంబీకులు ధర్మకర్తలుగా, యాదవులు పూజారులుగా ఉంటూ ప్రతి ఏటా అమ్మవారికి జాతర నిర్వహిస్తూ, వరో పక్క ఆలయ అభివృద్ధికి కృషి చేస్తూ వస్తున్నారు. అమ్మవారిని దర్శించుకంటే కోరిన కోర్కెలు తీర్చు అమ్మవారిగా ఎంతో ప్రసిద్ధి గావించింది. సంతానం లేని వారికి తప్పనిసరిగా సంతాన ప్రాప్తి కలుగుతుందని, పాడిపంటలు, కుటుంబ సుఖసంతోషాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం.

భక్తులకు సకల సౌకర్యాలు

తానచంర్ల శివారు పాలేరు నది ఒడ్డున ఉన్నే గంగమ్మ జాతరకు వచ్చే భక్తుల సకల సౌకర్యాలు ధర్మకర్తలు కల్పించారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని ఆలయ ప్రాంగణంలో ఐదు చేతి పంపులు, ఓ హౌజ్, రెండు వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేసి తాగునీరు అందించే ఏర్పాట్లు చేశారు. ఎండలు తీవ్రతరం అయినందున చిన్నపిల్లలు, వృద్ధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఆలయ ధర్మకర్తలు రామసహాయం సత్యనారాయణరెడ్డి సూచించారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



మానుకోటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్



బయ్యారం: కొనుగోలు కేంద్రంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్/కేసముద్రం/గూడూరు/నెల్లికుదురు: రైతులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ.. కోనుగోలు కేంద్రాలలోనే ధాన్యం విక్రయించాలన్నారు. కేంద్రాలలోనే మద్దతు ధర వస్తుందని రైతులు గమనించాలన్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సన్నరకం ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ అందిస్తున్న ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. ఆర్థికంగా వెనకబడిన కుటుంబాలకు నాణ్యమైన బియ్యం అందించాలనే ఉద్దేశంతో, కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్‌షాపుల నుంచి సన్నరకం బియ్యం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, మెప్మా డీఎంసీ విజయ, నాయకులు శంతన్‌రామరాజు, వెంకట్‌రెడ్డి, కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజ్మీరా సురేష్, సొసైటీ చైర్మన్ మర్రి రంగారావు, దికొండ వెంకన్న, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, గూడూరు తహసీల్దార్ శ్వేత, నెక్కొండ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఎడ్ల నరేష్‌రెడ్డి, ఏఓ అబ్దుల్‌మాలిక్, మండల అధ్యక్షుడు చిట్టె వెంకన్న పాల్గొన్నారు.

చోక్లాతండాలో ప్రారంభించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య

బయ్యారం: మండలంలోని వెంకట్రాంపురం పంచాయతీ పరిధిలోని చోక్లాతండాలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంను శుక్రవారం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధరతోపాటు బోనస్‌ను పొందాలన్నారు.

కమిటీ సభ్యులను కఠినంగా శిక్షించాలి



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: నిజామాబాద్ జిల్లాలోని తాళ్లరాంపూర్ గ్రామంలో గీత కార్మికులను బహిష్కరణ చేసి, మహిళలను గుడిలోకి రాకుండా అవమానించిన గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులను కఠినంగా శిక్షించాలని కేజీకేఎస్ జిల్లా కార్యదర్శి గొని వెంకన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని వివేకానంద సెంటర్‌లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గ్రామ కమిటీ దిష్టి బొమ్మను శుక్రవారం దహనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ కుల వృత్తులు చేస్తున్న వారిని బహిష్కరిస్తున్నట్లు ప్రకటించిన కమిటీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గౌడ కులస్తులకు జీవనోపాధి కల్పించే ఈత చెట్లను తగలబెట్టడం, కుల వృత్తులను అవమానించేలా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సూర్నపు సోమయ్య, జెర్రిపోతుల వెంకన్న, బిక్కి వెంకటేశ్వర్లు, గునిగంటి మోహన్, మంద విక్రమ్‌గౌడ్, దొమ్మటి సోమయ్య, బొల్లం అశోక్, ఎర్ర శ్రీనివాస్, చీపిరి యాకయ్య పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ నిరసన



గార్ల: నిరసన తెలుపుతున్న ముస్లింలు

డోర్నకల్: వక్ఫ్ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ డోర్నకల్‌లో శుక్రవారం ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. ఈనెల 21న మహబూబాబాద్‌లో ముస్లింల ఆధ్వర్యంలో నిర్వహించే ర్యాలీకి పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

బయ్యారం: వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ శుక్రవారం బయ్యారంలో ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో మతపెద్దలు షరీఫ్, బాబా, ఖాసీంమీరా, జిలాని, యాకూబ్‌పాషా పాల్గొన్నారు.

గార్ల: వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ గార్లలో ముస్లింలు శుక్రవారం మజీద్ ఎదురుగా కుడి చేతికి నల్లబ్యాడ్జీలు ధరించి ప్లకార్డులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షుడు ఎండీ షఫీయుద్దీన్, షఫీయుద్దీన్, ఎస్‌కె బుడాన్, రహీంఖాన్, ఖదీర్ పాల్గొన్నారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే



మహబూబాబాద్ రూరల్: శిలువయాత్రలో పాల్గొన్న క్రిస్టియన్లు



గార్ల: శిలువయాత్రలో పాల్గొన్న క్రిస్టియన్లు



డోర్నకల్: ఏసుక్రీస్తు శిలువ యాత్ర..



మరిపెడలో..

గుడ్ ఫ్రైడే వేడుకలు శుక్రవారం క్రిస్టియన్లు ఘనంగా నిర్వహించారు. మానవులను పాపాల నుంచి విముక్తి కలిగించేందుకు ఏసుక్రీస్తు శిలువను ఎత్తుకుని తన రక్తాన్ని ధారపోసిన రోజును క్రైస్తవులు గుడ్ ఫ్రైడేగా జరుపుకుంటారు. ప్రార్థనల అనంతరం శిలువ యాత్ర నిర్వహించారు. - సాక్షి నెట్‌వర్క్

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

కేసముద్రం: మున్సిపాలిటీ కేంద్రంలోని రెడ్డిసేవా సంఘం ఫంక్షన్ హాల్‌లో పదవీ విరమణ పొందిన, పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను పీఆర్‌టీయూ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. సన్మానం పొందిన వారిలో జగన్మోహన్‌రెడ్డి, సోమిరెడ్డి, పదోన్నతి పొందిన బండారు నరేందర్, బిల్లిపెల్లి లక్ష్మారెడ్డి, తుమికి వినోద్‌రాజ్, రాజయ్య, హరినాథ్, వాగ్యా, కొప్పుల శంకర్, నాగయ్య, శ్రీనివాస్, మార్కండేయా ఉన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పాదిల వెంకట్‌రెడ్డి, నాగనబోయిన వెంకటేశ్వర్లు, భాస్కర్‌రావు జనార్దన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 10నుంచి 12వ తరగతి వరకు చదువుకున్న విద్యార్థులు 1980–83బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులను పూర్వ విద్యార్థులు సన్మానించారు. మృతి చెందిన ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులకు నివాళులర్పించారు. మెడికల్ కళాశాలకు మృతి చెందిన తర్వాత భౌతికాయంను అందజేయడానికి పూర్వ విద్యార్థులు నాగరాజు తల్లి, నాయిని వెంకట్‌రెడ్డి, భిక్షపతి ముందుకువచ్చారు. కార్యక్రమంలో జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు, వాసుదేవ్, ఆకుల రాజు, సుంకర శ్రీనివాస్, రమేశ్, గోపినాథ్, నాగరాజు, వెంకటేశ్వరరెడ్డి, మనోహర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, భిక్షపతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

మరిపెడ రూరల్: మరిపెడ మండలం సోమ్లతండా గ్రామ పంచాయతీ పరిధిలోని లంబాడీల ఐక్యవేదిక సంఘం ఆధ్వర్యంలో గోర్ మాటీ సదస్సు పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి లంబాడీల ఐక్యవేదిక రాష్ట్ర ముఖ్య సమన్వయకర్త జాదవ్ రమేష్‌నాయక్ హాజరై మాట్లాడారు. విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పూజారి సీతారాంనాయక్, లాలుసాద్, గుగులోతు దేవేందర్, రాజేష్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కారం అందజేత

బయ్యారం: మండలంలోని కోటగడ్డ గ్రామానికి చెందిన ఆడెపు హరిప్రసాద్ పద్మశాలీ బిజినెస్ నెట్‌వర్క్, పీబీఎన్ ఆధ్వర్యంలో అందించే జాతీయ ఉగాది పురస్కారానికి ఎంపికయ్యారు. కోటగడ్డ గ్రామానికి చెందిన హరిప్రసాద్ స్వయం కృషితో ఎదిగి సొంతంగా సాఫ్ట్‌వేర్ కంపెనీ నెలకొల్పారు. హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో హరిప్రసాద్‌కు ఉగాది పురస్కారం అందజేశారు.

తెలుగు సాహితీ పట్టాభిషేకానికి ఆహ్వానం

కురవి: మండలంలోని తిర్మలాపురం గ్రామానికి చెందిన రచయిత, కవి, వాస్తు సిద్ధాంతి, జ్యోతిష్య నిపుణుడు బొల్లోజు భరత్ ఉపేంద్రాచార్యులుకు వచ్చే నెల 10, 11వ తేదీల్లో ఏపీలోని ఏలూరులో జరిగే శ్రీశ్రీ కళావేదిక ప్రపంచ తెలుగు సాహితీ పట్టాభిషేక మహోత్సవానికి ఆహ్వానం అందినట్లు శుక్రవారం తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం.. కేసు నమోదు



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని నందమూరి నగర్ కాలనీకి చెందిన విశ్రాంత ఉద్యోగి శిరంశెట్టి సోమ నర్సయ్య అదృశ్యమైన ఘటనలో కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ శుక్రవారం తెలిపారు. నర్సయ్య కొంతకాలం నుంచి షుగర్ వ్యాధితో బాధపడుతూ తన నివాసంలోనే ఉంటున్నాడని, ఈ నెల 15వ తేదీన ఇనుగుర్తి మండలానికి వెళ్లి వస్తానని ఇంట్లో కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లి, తిరిగి ఇంటికి రాలేదు. సమాచారం లభించకపోవటంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా టౌన్ ఎస్సై కె.శివ కేసు నమోదు చేశాడన్నారు. వృద్ధుడి ఆచూకీ తెలిస్తే 94416 81585 నంబరుకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

సదాశయ జిల్లా కన్వీనర్‌గా ఎస్‌డీ గౌస్

విద్యారణ్యపురి: హనుమకొండ సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సదాశయ ఫౌండేషన్ ఉమ్మడి జిల్లా స్థాయి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో సదాశయ నూతన కమిటీలను ఎన్నుకున్నారు మహబూబాబాద్ జిల్లా కన్వీనర్‌గా ఎస్‌డీ.గౌస్ ఎన్నికయ్యాడు.

అభియోగాలను నిరూపించాలి

గూడూరు: రాజకీయ ముసుగులో అవినీతి అక్రమాలు, భూదందాలకు పాల్పడుతూ, గిరిజన ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, తనపై చేసిన అభియోగాలను నిరూపించాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బానోతు చందూనాయక్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కుల సంఘం పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నానని బుధవారం తనపై డీఎల్‌పీఓకు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకులను హెచ్చరించాడు. తాను అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు నిరూపిస్తారా.. చర్చకు వస్తారా అని చందూనాయక్ డిమాండ్ చేశాడు.

పనిచేయని చేతిపంపు



పనిచేయకుండా ఉన్న చేతిపంపు

కురవి: మండలంలోని నల్లెల్ల శివారు సూర్యతండా గ్రామంలోని ఐదోవార్డులో చేతిపంపు పనిచేయకుండా నిరుపయోగంగా ఉంది. చేతి పంపునకు ఉన్న సామగ్రిని తీసి పక్కకు పడేయడంతో అవి తుప్పుపడుతున్నాయి. అసలే ఎండాకాలం నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తండావాసులు తెలిపారు. చేతిపంపును రిపేరు చేసి తాగు నీటిని అందించే ఏర్పాట్లు చేయాలని తండవాసులు అధికారులను కోరుతున్నారు.

రోడ్డు పక్కనే తోపుడు బండ్లు



రోడ్డు పక్కన ఉంచిన తోపుడు బండి

డోర్నకల్: డోర్నకల్ పట్టణంలోని పలు ప్రధాన వీధుల్లో రోడ్లపై రాత్రికి రాత్రే దుకాణాలు వెలుస్తున్నాయి. ఇప్పటికే రైల్వేస్టేషన్ సెంటర్, మెయిన్ రోడ్డు, గాంధీ సెంటర్, బ్యాంక్‌స్ట్రీట్, బైపాస్ రోడ్డులో ఇష్టారాజ్యంగా రోడ్ల పక్కన దుకాణాలు, తోపుడుబండ్లు ఏర్పాటు చేశారు. రోడ్ల పక్కన దుకాణాల ఏర్పాటుతో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు స్పందించి రోడ్ల పక్కన ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేస్తున్న దుకాణాలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వృథాగా పోతున్న తాగునీరు



వృథాగా పోతున్న నీరు

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని చర్చి కాంపౌండ్ సమీపంలోని ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు అమర్చిన పైపులు పగలడంతో తాగునీరు వృథాగా పోతోంది. నెలరోజులుగా మిషన్ భగీరథ నీరు అరకొరగా సరఫరా అవుతుండడంతో ఓవర్‌హెడ్ ట్యాంకు ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. మున్సిపాలిటీ సిబ్బంది స్పందించి పైపులకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

వారంరోజులుగా వెలగని వీధిలైట్లు



చీకట్లో ఉన్న వీధి

గార్ల: మండలంలోని చిన్నకిష్టాపురం పంచాయతీ దేశ్యాతండాలో వారంరోజుల నుంచి వీధిలైట్లు వెలగక పోవడంతో రాత్రి సమయంలో బయటకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వీధిలైట్లు వెలగడం లేదని విద్యుత్ అధికారులకు, పంచాయతీ కార్యదర్శికి చెప్పినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.